మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




## శాశ్వత న్యాయమూర్తులుగా ఇద్దరి నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 26, నమస్తే తెలంగాణ: హైకోర్టులోని అదనపు న్యాయమూర్తులు జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావును శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 13న హైకోర్టు కొలీజియం నిర్ణయాన్ని గవర్నర్, సీఎం సమర్థించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆధ్యక్షతన కొలీజియం ఆమోదంతో ఈ నెల 16న కేంద్రానికి సిఫార్సు చేసింది. వీరిద్దరూ శాశ్వత న్యాయమూర్తులుగా సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## నాకు ప్రాణహాని ఉంది

### పోలీసులకు ఫిర్యాదు చేసిన జై భారత్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : సీబీఐ మాజీ అధికారి, జై భారత్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ తనకు ప్రాణహాని ఉందంటూ విశాఖ సీపీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. తనను చంపేందుకు గాలి జనార్దన్ రెడ్డి అనుచరులు ప్లాన్ చేశారని ఆరోపించారు. జేడీ లక్ష్మీనారాయణ విశాఖ నార్త్ నుంచి జైభారత్ పార్టీ తరపున అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన కాలంలో ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో గాలి జనార్దన్‌రెడ్డిని, అక్రమ ఆస్తుల కేసులో జగన్‌ను, ఇతర కేసులో ఐఏఎస్ అధికారులను జైలుకు పంపిన అధికారుల్లో లక్ష్మీనారాయణ ఒకరు.

## ప్రభాకర్‌రావుకు రెడ్‌కార్నర్ జారీ కాలేదు

### ఊహాగానాలతో దర్యాప్తుకు ఆటంకం కలిగించొద్దు: సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతున్నదని, ప్రభాకర్‌రావుకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయలేదని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అంతర్జాతీయ సెల్‌ఫోన్ దొంగల ముఠాను అరెస్ట్ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియా ఫోన్ ట్యాపింగ్ కేసు గూర్చి వివరాలు అడిగింది. అయితే సీపీ స్పందిస్తూ.. ఉహాగానాలతో దర్యాప్తును ఇబ్బంది పరుస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ నేతల ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతున్నదని చెప్పారు. ప్రభాకర్‌రావును పట్టుకోవడం లేదనే వార్త అవాస్తవమని స్పష్టంచేశారు. ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. సరైన సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసు వివరాలు వెల్లడిస్తామని సీపీ పేర్కొన్నారు.



















